క్లుప్తంగా

'ఖిల్లా' డీటీగా నందకిశోర్



ఖిల్లాఘనపురం: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నందకిశోర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దుబ్బాక పరమేశ్వర్ జిల్లా పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లడంతో డీఎస్‌ఓ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నందకిశోర్‌ను మండలానికి కేటాయించారు. ఈ మేరకు తహసీల్దార్ సుగుణను కలిసి బాధ్యతలు చేపట్టినట్లు నందకిశోర్ చెప్పారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కంప్యూటర్లు దగ్ధం



వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పలు ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి సమయంలో షార్ట్‌సర్క్యూట్ వల్ల కళాశాలలో ఉపయోగించే కంప్యూటర్ పరికరాలతో పాటు సీసీ కెమెరాల కూడా పాడైనట్లు ఆయన వివరించారు. వీటి విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.

సీసీఎల్ఎస్ మంజూరు చేయాలని వినతి



వనపర్తి విద్యావిభాగం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ఎస్ మంజూరు చేయాలని మంగళవారం విద్యాశాఖ జిల్లా అధికారి అబ్దుల్‌ఘనికి తపస్ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, ఈశ్వర్, వనపర్తి మండల అధ్యక్షుడు రాములు తదితరులు ఉన్నారు.

పెరియార్‌కు ఘన నివాళి



వనపర్తి టౌన్: సంఘ సంస్కర్త పెరియార్ 51వ వర్ధంతిని పురస్కరించుకొని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ పెరియార్ తమిళనాడులో ఆత్మగౌరవ ఉద్యమం, ద్రావిడ ఉద్యమ నిర్మాత, పీడిత కులాల ప్రజలకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ నేతల నుంచి విమోచనం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో కవి పండితుడు బైరోజు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, గంధం నాగరాజు, మండ్ల దేవన్ననాయుడు, బాలేమియా, శివశంకర్, బీచుపల్లి మాదిగ, వెంకటయ్య, నరసింహ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన లాయర్ శివన్నసాగర్ భార్య చిలుక ప్రసన్న అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ కొండన్న, ధర్మానాయక్, బాలకృష్ణ, శ్రీను, అశోక్, మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకారుపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 2007–2008 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

శాంతి మార్గంలో పయనించాలి

- క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- జిల్లావ్యాప్తంగా చర్చీల ముస్తాబు



వనపర్తిలో క్రైస్తవులకు కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్: క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, విలువలు నేర్పుతుందని, క్రైస్తవులందరూ శాంతి మార్గంలో పయనించాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రైస్తవులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో హింస, దోపిడీ, నియంతృత్వం పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న వేళ రోమన్ సామ్రాజ్యంలో బేత్లెహెం గ్రామంలో ఏసు జన్మించి నియంతృత్వానికి చరమగీతరం పలికారని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, డాక్టర్ నిర్మల, లివింగ్‌స్టన్, పాస్టర్లు జనార్దన్, కృష్ణకుమార్, యేసన్న, శ్రీకాంత్, జోసెఫ్, విజయ్‌కుమార్, స్వామిదాస్, గంధం ప్రసాద్, యాకోబు, కేశవులు, జాన్, ఐజాక్, రోనాల్డ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఏసుక్రీస్తు జయంతి సందర్భంగా బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పట్టణంతో పాటు గ్రామాల్లో ఉన్న చర్చిలను మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు సీజే జర్మియా, విద్యాసాగర్, డేవిడ్, శ్యాంసుందర్, సుమన్ తెలిపారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

మక్తల్ నియోజకవర్గ పరిధిలోని క్రైస్తవులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ, టీపీసీసీ అధికార ప్రతినిధి, కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, మాజీ ఎంపీపీలు బంగారుశ్రీను, శ్రీధర్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

అమరచింత: పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చిని విద్యుత్ దీపాలతో చక్కగా అలంకరించారు. డిసెంబర్ 25న జరిగే వేడుకను పురస్కరించుకొని స్వాగత తోరణాలను మెర్క్యూరీ బల్బులతో తీర్చిదిద్దారు.



జిల్లాకేంద్రంలోని వృద్ధాశ్రమంలో..



అమరచింత ఎంబీ కర్మేల్ చర్చి



ఆత్మకూర్‌లో..

గ్రూప్–4 ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

వనపర్తి టౌన్: తాజాగా వెలువడిన గ్రూప్–4 ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు 10మంది జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికయ్యారు. వారిని కళాశాల యాజమాన్యం మంగళవారం విద్యార్థుల సమక్షంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలను సంపాదించడానికి పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని కళాశాల యాజమాన్యం సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ కె.వీరయ్య, కళాశాల సొసైటీ జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, కళాశాల సొసైటీ ట్రెజరర్ కుమారస్వామి, ప్రిన్సిపాల్ ప్రకాష్, సీనియర్ అధ్యాపకులు రమణ, జమీర్ అహ్మద్‌ఖాన్, వెంకటేశ్వర్‌రెడ్డి, లింగస్వామి, లెక్చరర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

వాల్మీకుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తకోట రూరల్: వాల్మీకుల సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, కార్పొరేషన్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను వాల్మీకి బోయ ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ పదవుల్లో వాల్మీకి బోయలకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వాల్మీకి బోయలకు కార్పొరేషన్ పదవి ఇస్తే రాష్ట్రంలోని 4.50లక్ష మంది వాల్మీకి బోయల ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పార్టీ కాపాడినట్లు ఉంటుందని నాయకులు గుర్తు చేశారు. అందుకు మహేష్‌కుమార్‌గౌడ్ స్పందిస్తూ త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ విషయంపై చర్చిస్తానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం అక్కడే ఉన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీకే కుర్మన్న, హరిశంకర్‌నాయుడు, రమణ, భీమన్న నాయుడు, రాంచంద్రయ్య, మూర్తి, బొగ్గు వెంకటేష్, శ్రీనివాసులు, విజయ్, నీలస్వామి, రవి, రాజు తదితరులు ఉన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

ఆత్మకూర్: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి కలిగి వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఖానాపూర్‌కు చెందిన శివన్న (35) భార్య సుజాతతో తరుచూ గొడవలు పడుతుండేవాడు. ఈక్రమంలో వారం రోజుల క్రితం భార్య పిన్నంచర్లలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. క్రిస్మస్ పండుగ సందర్భంగా భార్య తన ఇంటికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శివ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గమనించిన చుట్టు పక్కల వారు తలుపులు బద్దలు కొట్టి.. ప్రైవేట్ వాహనంలో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శివ అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు శివన్నకు భార్య సుజాతతో పాటు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

పల్లె ప్రకృతి వనం తొలగింపుపై ఎంపీడీఓకు ఫిర్యాదు



మల్కిమియాన్‌పల్లిలో పల్లె ప్రకృతి వనం కంచె, చెట్లను తొలిగించిన ప్రాంతం

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లిలో సుమారు నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని సంరక్షించాలని గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు మంగళవారం ఎంపీడీఓ వెంకటాచారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ నాలుగులో 8 గుంటల ప్రభుత్వ భూమిలో ఉపాధి హామీ నిధులు రూ.3 లక్షలతో పల్లె ప్రకృతి వనం నిర్మించారు. కూలీలతో ప్రతిరోజు నీరు పట్టించి, మొక్కలు ఏపుగా పెరిగేందుకు కృషి చేశారన్నారు. అలాంటి పల్లె ప్రకృతి వనానికి ఏర్పాటు చేసిన కంచె, వనంలోని చెట్లను తమ గ్రామానికి సంబంధం లేని ఓ అధికార పార్టీకి చెందిన నాయకుడి సహకారంతో కొందరు చెట్లను తొలిగిస్తున్నారని మండిపడ్డారు. పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసిన సర్వే నెంబర్ 4లోనే 8 గుంటల భూమి ఖాళీగా ఉందని, గ్రామానికి మంజూరైన గ్రామ పంచాయతీ భవనం, మహిళా సంఘం భవనం ఈ స్థలంలోనే నిర్మించాలని కోరారు. గ్రామం నుంచి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న సుమారు 600 గజాల ప్రభుత్వ భూమిలోను నిర్మించే అవకాశం ఉందన్నారు. అలా కాకుండా రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వనాన్ని తొలిగించడం ఏమిటన్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ వెంకటాచారి మాట్లాడుతూ మల్కిమియాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని తొలిగిస్తున్న సమయంలో తాను అదే గ్రామంలో ఉన్నానని చెప్పారు. విషయం తెలియగానే అక్కడికి వెళ్లి జేసీబీని నిలిపివేశామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై గ్రామ పంచాయతీ కార్యదర్శితో పోలీసులకు ఫిర్యాదు చేయిస్తామని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రాములు, సత్తిరెడ్డి, శ్రీనివాసులు, శ్రీను ఉన్నారు.



ఖిల్లాఘనపురం ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న మల్కిమియాన్‌పల్లి గ్రామస్తులు

అప్రమత్తంగా ఉండాలి

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఊరి చివర గృహాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాణి విజ్ఞప్తి చేశారు. కొన్ని గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఊరి చివర ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని సంగినేనిపల్లి, మండల కేంద్రంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని, వీటి నివారణ కోసం అన్ని గ్రామాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె చెప్పారు. సైబర్ నేరాలపై యువకులకు అవగాహన కల్పిస్తున్నామని ఆమె తెలిపారు.

సాయిబాబా ఆలయంలో న్యాయమూర్తి పూజలు



ఆత్మకూర్: ప్రముఖ సాయిక్షేత్రమైన సాయిబాబా ఆలయంలో మంగళవారం రాత్రి వనపర్తి ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ న్యాయమూర్తి శ్రీలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీదత్తాత్రేయ స్వామి, సంతాన నాగదేవత, శయనసాయిలను దర్శించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు న్యాయమూర్తిని శేషవస్త్రాలతో సన్మానించి, ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు, కోర్టు సిబ్బంది, భక్తులు ఉన్నారు.

జిల్లాలో తీరనున్న విద్యుత్ సమస్యలు

వనపర్తి: జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.46.48 కోట్లు మంజూరు చేసినట్లు మంగళవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఉన్న విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించిందని, మున్సిపాలిటీలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఎక్కడైనా సమస్య నెలకొన్నట్లు అధికారుల దృష్టికి తీసుకొస్తే.. వెంటనే పరిష్కరించేందుకు ఈ నిధులు ఉపయోగించుకోవచ్చన్నారు. విద్యుత్ స్తంభాల మార్పు, కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్ల షిఫ్టింగ్, 33 కేవీలైన్, 11 కేవీ లైన్ల షిఫ్టింగ్‌తో పాటు ఇతర సమస్యలు పరిష్కరించేలా అధికారులకు సూచనలు ఇచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, సహకరించిన ఎంపీ డాక్టర్ మల్లురవికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపడుతున్నామని ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, కమిషనర్ శశిధర్ అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో, మున్సిపాలిటీలోని వార్డుల్లో సర్వే కొనసాగిందన్నారు.

కార్మికులకు సామగ్రి పంపిణీ

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు సబ్బులు, నూనె తదితర వస్తువులను అందజేసినట్లు ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి తెలిపారు. అలాగే నర్సరీలను సందర్శించి నాణ్యమైన విత్తనాలు వాడాలని నిర్వాహకులకు సూచించారు.



యాసంగికి సాగునీరు విడుదల చేయాలి

పెబ్బేరు రూరల్: యాసంగి పంట కోసం సాగునీటిని విడుదల చేయాలని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డిని మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. యాసంగి పంటకు రైతులు నారుమళ్లు వేసుకొని నీటి కోసం ఎదురుచూస్తున్నారని, నాట్లకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు సకాలంలో నీటిని అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. యాసంగికి నీళ్లు వదలని పక్షంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, దిలీప్‌రెడ్డి, కరుణశ్రీ, సాయినాథ్, కర్రెస్వామి, జగన్నాథంనాయుడు, సుమతి, పార్వతి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బకాయి నిధులు విడుదల చేయాలి

వనపర్తి రూరల్: రాష్ట్రంలో రూ.7,800 కోట్లకు పైగా ఉన్న విద్యార్థుల పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ రమేష్, మాజీ విద్యార్థి నేత గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలను చెల్లించకుండా విద్యా వ్యవస్థను నాశనం చేసిందని ధ్వజమెత్తారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుందని, వీరైనా విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు విద్యకు తగినన్ని నిధులను కేటాయించటం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మోహన్, అరవింద్, గణేష్, శివ, బన్నీ, చరణ్, కళ్యాణ్, మురళి, భాను, బాలు, ఓంకార్, యుగంధర్, చిన్న చరణ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

'గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దు'



దీక్ష చేస్తున్న బలిజపల్లి గ్రామస్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి గ్రామ పంచాయతీని జంగమాయపల్లి పంచాయతీలో విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని బలిజపల్లి గ్రామస్తులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు పంచాయతీలు వేరువేరుగా ఉండడం ద్వారా అభివృద్ధి వేగంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు. పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం బలిజపల్లిని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారని, మళ్లీ విలీనం ద్వారా ప్రజలకు ఇబ్బందులు సృష్టించొద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయంతి, గ్రామస్తులు గిరిజాదేవి, కమలమ్మ, పద్మమ్మ, వనజ, నర్సింహారెడ్డి, నగేష్, రాములు, వెంకటేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పంట రుణమాఫీ చేయాలి

వనపర్తి రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30 నుంచి 35 శాతం మంది రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ నివేదికలు తెప్పించుకొని రూ.రెండు లక్షల లోపు రుణమున్న రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. అత్యుత్సాహ చర్యల వల్ల చిత్ర పరిశ్రమ తెలంగాణ నుంచి తరలిపోయే ప్రమాదం ఉందన్నారు. అందులో లక్షలాది కార్మికుల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అర్హత ఉన్న వారందరికీ ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో గతేడాదిగా ప్రాజెక్టు నిర్మాణ పనులు ఆగిపోయాయని దుయ్యబట్టారు. నల్గొండలో జరిగే సీపీఐ 100వ ఆవిర్భావ ఉత్సవాలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో విజయరాములు, కళావతమ్మ, చంద్రయ్య, రమేష్, గోపాలకృష్ణ, రాబర్ట్, మోష, కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలనరసింహ

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి


వనపర్తి: రాజ్యాంగ నిర్మాతను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం కలెక్టరేట్ ఏఓ భానుప్రకాష్‌కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు జిల్లా శ్రీనివాస్‌రెడ్డి, శ్రీలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏఓ భానుప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజేంద్రప్రసాద్‌యాదవ్

ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి, కదిరెపాడు, వెంగళాయిపల్లి, అన్నారంతండా గ్రామాల్లో ఉపాధి పనుల సామాజిక తనిఖీపై మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి, 2024 మధ్యలో రూ.84.563 లక్షల సంబంధించిన పనులు, చేసిన ఖర్చుపై గ్రామసభలో పనుల వారీగా చర్చించి, అభ్యంతరాలను నమోదు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది వెల్లడించారు. బుధవారం పాన్‌గల్‌లో ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



వెంగళాయిపల్లిలో ఉపాధి పనులపై చర్చిస్తున్న అధికారులు, గ్రామస్తులు

'డ్రమ్‌సీడర్‌తో కూలీల కొరత అధిగమించొచ్చు'

కొత్తకోట రూరల్: రైతులు కూలీల ఖర్చు తగ్గించుకునేందుకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారిని జసెమిన్ అన్నారు. మంగళవారం మండలంలోని సత్యహళ్లిలో రైతు అర్జునయ్య వ్యవసాయ పొలంలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తే విధానాన్ని చూయించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సీడర్‌తో వరినారుతో సంబంధం లేకుండా వరి విత్తనాలు నేరుగా వేయవచ్చని, దీంతో లాభాలు, తెగుళ్ల నివారణ, సస్యరక్షణ, దిగుబడి అధికంగా వస్తుందని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రవీందర్‌రెడ్డి, రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, భరత్ తదితరులు ఉన్నారు.

